# చిదంబర రహస్యం

'బీయార్'

చిదంబర శాస్త్రికి చిన్నప్పుడే పెళ్ళయింది. చదువు పూర్తయి ఉద్యోగం వచ్చినా ఇంకా భార్య కాపరానికి రాలేదు. అర్భకురాలు. అదీగాక ఒక్కొక్క శరీరతత్వం అటువంటిది.

ఇంకో ఏడాదీ ఏణ్ణర్థందాకా చిదంబరానికి బ్రహ్మచర్యం తప్పేట్టులేదు. డింకీలు కొట్టకుండా ప్యాసవుతాడనీ, అయ్యా అవ్వంగానే ఇలా ఉద్యోగం వచ్చేస్తుందనీ, పట్నంలో కాపరం పెట్టాల్సి వస్తూందనీ కామేశ్వరిమాత్రం కలగన్నదా ఈ పాటికి ఈడేరి సిద్ధంగా కూచోడానికి!?

కలక్టరేట్లో క్లర్కై అయినప్పటికీ-ఏదో ఒక ఉద్యోగస్తుడయ్యాడు, సంపాయించుకుంటు న్నాడు, ఒంటరిగా వుంటున్నాడు, వయసేమో చిలిపిది, పట్నవాసం, ఆకర్షణలకీ అవకాశాలకీ అంతులేదు. ఏమో ఎటుపోయి ఎటువస్తుందో- మన జాగర్తలో మనం వుండడం మంచిది, ఆనక ఆకులు పట్టుకుని ప్రయోజనం లేదు- అనిచెప్పి సొంత ఊళ్ళో పెద్దవాళ్ళు నలుగురూ ఆలోచించి, చదువు నెపంతో తీసుకువచ్చి మేనల్లుణ్ణి ఒకణ్ణి చిదంబరానికి కాపలాగా తగిలించారు.

ఏ సిగరెట్లకయినా అర్ధరాత్రివేళ అద్దద్దా అంటే పనికొస్తాడనీ, ఎక్కడికిపోయి ఎప్పటికి వచ్చినా కాస్త కొంపకి కాపలా వుంటాడనీ, తీరిక వేళ ఏదో ఇంత కాలక్షేపమనీ, అన్నిటికి మించి బాధ్యత అనీ, గారాబంతో పెంకివెధవగా తయారయి వుంటే కాస్త చేతికింద నలగ్గొడదా మనీ ఇలా ఏవేవో మంచీచెడూ ఆలోచించి చిదంబరశాస్త్రి అంగీకరించాడు. మేర్బానీగా ఆహ్వానించాడు కూడాను. మేనల్లుడికి ఇంటరు అయ్యింది. వచ్చి డిగ్రీలో చేరాడు. ఇద్దరిదీ హోటలు భోజనం-మఠం నిద్ర. సాఫీగానే సాగి పోతున్నాయి రోజులు.

ఉన్నట్టుండి ఒకరోజున చిదంబరానికి అత్తా రింటి నుంచి ఆహ్వానం వచ్చింది. ప్రకృతిదేవత కరుణించి పచ్చజెండా ఊపింది. అబ్బో! ఇక మాస్కోండి- పల్లెకుపోదాం పారును చూధాం అని పాడుకుంటూ ఆఘమేఘాలమీద వెళ్ళి వాలిపోయాడు.

హోటలుకూడు పడడం లేదనీ, వండు కుందుకు టయిమ్ చాలదనీ, మేనల్లుడి చదువు చెడుతుందనీ, ఇలా ఎక్కడెక్కడి కారణాలూ ఈసుళ్ళులాగా పుట్టుకొచ్చేశాయి. కనీసం మరో ఆరు మాసాలయినా ఆగుబాబూ అని బతిమాలు తున్న అత్తమామల్ని కిందబెట్టి మీదబెట్టి ఎలా గయితేనేం కామేశ్వరిని కాపరానికి తెచ్చేశాడు.

ఒక్కగానొక్క గది. పెంకులు పరచిన గది. ముందూ వెనకా బంగళా పెంకులతో పంచలు దించారు. ముందు పంచకి మెష్షు వుంది. వెనక పంచలో కిచెనూ బాత్రూం వగయిరా వున్నాయి. పంపు వుంది. బావికూడా వుంది. ఇదీ మొత్తం ఇల్లు. ఎవరితోనూ సంబంధం లేకుండా కాంపౌండులో ఒక పెడగా వుంది. మోకాళ్ళమీద చుబుకం ఆన్చుకుని, బుట్టలాగ్గా పరికిణీ అంచు పరుచుకుని ముచ్చటగా లాన్సులో ముదుచుకు కూచున్న పడుచు పిల్లలాగా వుంది. అన్నీ బాగానే వున్నాయి. యజమానులు కూడా సౌమ్యులు. అద్దె నూటయాభై రూపాయిలు మాత్రమే. ఫరవాలేదు. పగటిపూట హాయిగానే గడిచిపోతోంది. రాత్రి అయ్యేసరికి కొంచెం ఇబ్బందిగా వుంటోంది. మేనల్లుడు పంచలో ఏదో పుస్తకం ముందేసుకుని గుయ్ గుయ్ లాడు తుంటాడు.

గది తలుపులు వేసుకోవడం దగ్గర్నించి ఈ నూతన దంపతులకి అన్నీ సమస్యలే- అంతా సిగ్గే. అలాంజెప్పి ఊరుకుంటారా అంటే ఊరు కోలేరయ్యె. "చదువుతున్నావురా!" అని లోపల్నించి గట్టిగా గదమాయిస్తూ రావడం- "ఏమిటా గొణగడం! గట్టిగా చదువ్" అంటూ తలుపు వేసెయ్యడం. "ఏడిశావులే-ఇవ్వేళ్టికి ఇక పడుకో, తెల్లారగట్టే లేపుతాను చదువుదూ గానీ"- అని తానే నిద్రకి పురమాయించడం. ఇల్లాగ్గా రోజుకో ఉపాయంగా నడుస్తోంది. ఎంత తలుపులు మూసుకున్నా బెరుకు బెరుగ్గానే వుంటోంది.

జాకెట్టు విప్పెయ్యడం, చీర లాగెయ్యడం లాంటి పై సంగతులమాట దేవుడెరుగు- గుస గుసలకి మించి మాట్లాడుకోడానికి లేదు. గిలి గింతలు పెట్టుకుని కిలకిలా నవ్వుకోడానికి అస్సలు లేదు. గాజులు చప్పుడు అవ్వకూడదు. మంచం ఎక్కేటప్పుడూ దిగేటప్పుడూ బహు జాగ్రత్తగా వుండాల్సి వస్తోంది. అవసరం వచ్చి వెనక తలుపు తియ్యాల్సివస్తే మునికాళ్ళమీద

---

రడ్యార్డ్ కిప్లింగ్ చెప్పిన

"ఎంత తెలివితక్కువ ఆడదైనా చాలా తెలివైన పురుషుడ్ని అదుపులో పెట్టగలదు, కాని ఒక తెలివితక్కువవాడితో వ్యవహరించడానికి బాగా తెలివైన స్త్రీ కావాలి!"

అన్న సమస్యపై మేము ఆహ్వానించి ఎన్నిక చేసిన కథలకు యీ 'చిదంబర రహస్యం' మొదటి రచన.

మిగతా కథల జాబితా సంక్రాంతి సంచికలో ప్రకటిస్తున్నాము. రెండవ కథకోసం ఎదురు చూడండి !


—ఎడిటర్


నడవడమూ, చప్పుడు కాకుండా తెరవడమూ వెయ్యడమూ చాలా ఇబ్బందిగా వుంటోంది. పంచలో కూచుని వాడి మానాన వాడు చదువుకుంటున్నా ఏమిటో అన్నీ వాడు గమనిస్తున్నట్టూ ఎక్కడి నుంచో చూస్తున్నట్టూ లోపల్లోపల గిలిగా వుంటోంది. పగలు ఏ ముచ్చటా లేదు సరేసరి రాత్రిళ్ళు కూడా అలాగే అయిపోతోంది.

పొద్దుటే చిదంబరం ఆఫీసుకీ వీడు కాలేజీకి వెళ్ళిపోతారు. వీడుమాత్రం మధ్యాహ్నం భోజనానికి ఇంటికే వస్తాడు. సాయంత్రం ఇంచుమించు ఇద్దరూ ఒకేసారి వస్తారు. వాడు దయతలిచి ఏ లైబ్రరీకో వెళ్ళిననాడు ఒక గంటో రెండు గంటలో తప్ప వీళ్ళకి ఏకాంతం దొరకడం లేదు. ఆదివారాలూ, సెలవలూ ఇంచుమించు ఇద్దరికీ కలిసే వస్తున్నాయి. ఇంకా ఆ మాటకి వస్తే, వాడికే సెలవులు ఎక్కువ. పైగా ఏ రోజున ఎందువల్ల కాలేజీకి సెలవు ఇచ్చేస్తారో ఎవడూ చెప్పలేదు. అంచేత ఒకవేళ చిదంబరం సెలవుపెట్టి ఇంట్లో కూచున్నా ఏకాంతం దొరుకుతుందనడానికీ దొరకదనడానికీ అవకాశాలు సమానమే. అదీగాక చిదంబరానికి ఇంకా ఉద్యోగం ఖాయం అవ్వలేదు. అంచేత నెలకి ఒకటికన్నా ఎక్కువ సెలవలు పెట్టుకోడానికి లేదుట!

పోనీ వీడేమన్నా స్నేహితులనీ సినిమాలనీ తిరిగే రకమా అంటే అదీకాకపోయె. ఉత్త పుస్తకాల పురుగు. వీడికి తగిందే ఆ కాలేజి. వీడు జిడ్డయితే అది ముజ్జిడ్డు. క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ, ప్రిపబ్లిక్ అంటూ ఇప్పటికే పరీక్షలు యథా విధిగా వాళ్ళు నిర్వహిస్తున్నారు. వీడికి ప్రతి పరీక్షా ఫైనలే! పంచలో కూచుని చదివినవాడు చదివినట్టుంటాడు.

ఏదో వంకని తలుపులు మూసిన చిదంబరం కొత్త పెళ్ళాం జడలో మల్లెపూలు మత్తెక్కిం






చేస్తోంటే తల పులు తెరుచుకుని చిలిపిగా ఏదో చెయ్యబోతాడు. అంతలోకి పంచలో మనిషి గుర్తుకు వస్తాడు. దానితో నీరసించిపోతాడు. మధ్యలో ఏ మంచినీళ్ళకయినా లేపుతాడేమో అని మరొక అనుమానం—

"ఏవే! వాడికి మంచినీళ్ళు పెట్టావా?"

"అయ్యో మర్చేపోయానండీ!"

"చచ్చాం పో, అయితే లేపుతాడు"— అంటూ మంచినీళ్ళు పెట్టిరావడానికి చిదంబరమే లేస్తాడు. అంతలోకి పంచలో మనిషి మంచి నీళ్ళు తాగుతున్న చప్పుడు. కామేశ్వరికి తగని నవ్వు. అదుముకుని అదుముకుని ఉబికి ఉబికి నవ్వుతుంది. చిదంబరం ఉడికిపోయి ఏదో చెయ్యబోతాడు. ఎక్కడో గిల్లబోతాడు. కామేశ్వరి ముక్కుమీద వేలేసుకుని హుష్షు అంటూ పంచకేసి చూపిస్తుంది. పళ్ళు బిగబట్టి ఖర్మ అంటూ నుదురు కొట్టుకుని ఉస్సురంటూ ఒరిగిపోతాడు చిదంబరం. కాసేపటికి నోట్లో వేలేసుకుని నిద్రపోతాడు.

ఇంకొక్క గదయినా వుంటే బాగుండును. ఇల్లు మారదామా అనుకున్నాడు. అద్దె పెరుగుతుంది. మొయ్యలేదు. పైగా ఎంత అద్దె పెట్టినా ఇలాంటి ఇండిపెండెంట్ హవుస్ దొరకడం అసంభవం. ఒకవేళ దొరికినా ఇంటివాళ్ళు ఎలాంటి వాళ్ళవుతారో! ఇరుగుపొరుగున ఏ పోకిరీవాళ్ళు వుంటారో! పగలంతా కామేశ్వరి ఒంటరిగా వుంటుంది. వద్దు వద్దు! ఇల్లుమారే ప్రశ్నే లేదు అనుకున్నాడు చిదంబరం.

బొత్తిగా కొంచెమయినా స్వేచ్ఛ లేకుండా పోయిందే అని కామేశ్వరీ చిదంబరాలకి ఇద్దరికీ బాధగానే వుంది. మా ఆనందాన్నంతా తినేస్తున్నాడు వీడని కసిగానూ వుంది. అప్పుడప్పుడు సినిమాలకి పోయే అలవాటయినా చెయ్యక పోతిమే అని చిదంబరం తలకొట్టుకున్న క్షణాలు లేకపోలేదు.

కుర్రవెధవని కావాలని తీసుకువచ్చి ఇప్పుడేమో వేరే గది తీసుకోమనడంగానీ, హాస్టల్లో చేరిపొమ్మనడంగానీ బాగోదేమో అని పస్తాయిస్తున్నాడు చిదంబరం. కానీ కామేశ్వరేమో ఆడపిల్ల కాబట్టి ఇక వుండబట్టలేక ఒకరోజున బయట పడిపోయింది. వీడికి తిండీ బట్టలు ఫీజులు- బోలెడు డబ్బు అవుతోంది, మనకేమో ఇబ్బందిగానూ వుంటోంది. ఎంతకాలమని ఇలాగ! ఏదో ఒకటి- ముక్తికి మార్గం త్వరగా ఆలోచించండి స్వామీ! అనేసింది.

చిదంబరం మండిపడిపోయాడు. హోత్తెరీ నువ్వు ఎవ్వత్తెవు చెప్పడానికి అన్నాడు. నా మేనల్లుణ్ణి చదివించడం నా బాధ్యత అన్నాడు. డబ్బూ దస్కం అంటూ అనవసర విషయాల్లో జోక్యం కలిగించుకోవద్దు అన్నాడు. వాడేమీ పరాయివాడు కాదన్నాడు. ఇబ్బందులదేముంది- రెండేళ్ళు ముక్కుమూసుకుంటే వాడి చదువు పూర్తయిపోతుందన్నాడు. ముక్తీ గిక్తీ అన్నావంటే మూతిపళ్ళు రాలగొడతానన్నాడు. ఈ వీరాంగాలు చూసి అనవసరంగా నోరుజారానురా దేవుడా అని కామేశ్వరి లెంపలేసుకుంది. ఈ వీరావేశం వెంగళప్ప ఈ మాటకాస్తా పట్టుకెళ్ళి అత్తమామలకి ఎక్కడ ఊదుతాడో, అదిగో అడుగుపెట్టిందో లేదో అప్పుడే చూశావా అంటూ అపనిందలే వస్తాయో ఆరళ్ళే వస్తాయో అని లోలోపల కుమిలిపోయింద.

మేనల్లుణ్ణి తన దగ్గర పెట్టుకుని చదివించడం కామేశ్వరికి ఇష్టం లేదు అనే నిశ్చయానికి వచ్చేశాడు చిదంబరం. ఇక అక్కణ్ణించి అన్నింటికీ ఆరాలే, అన్నింటికీ నిగ్గదియ్యటాలే. వాడికి మధ్యాహ్నం కూరవేశావా? సాయంత్రం టీ ఇచ్చావా? ఈ ఆచూకీలు ఎక్కువయిపోయాయి. ఏదయినా ఒకటి మర్చిపోతే ఇక ఆవేళ పెద్ద రాద్ధాంతమే అయిపోతోంది. రచ్చ చేసేస్తున్నాడు. కామేశ్వరి భరించలేకపోతోంది.

చిదంబరంలో ఇలా పోలీసువాడు చోటు చేసుకున్నప్పటి నుంచీ కామేశ్వరిలో పెంకితనం పెరిగిపోతూ వచ్చింది. అవును-వీడికి నేనెందుకు పెట్టాలి, ఎందుకు చెయ్యాలి! అచ్చి వున్నామా! ఋణపడి వున్నామా! అంతగా చదువుకోవాలని వుంటే వేరే ఏడవమను. ఏ హాస్టలో చూసుకోమను. అంత లేనివాళ్ళేమీ కాదుగదా! మా నెత్తిన కూచోడం దేనికి!- ఇలాంటి ఆలోచనలు నానాటికీ బలపడిపోతున్నాయి. కానీ ఏమీ చెయ్యలేక నోరుమూసుకు కూచుంటోంది. రోజు రోజుకీ పెచ్చరిల్లిపోతున్న అయ్యగారి ధుమ ధుమలూ సెగలూ పొగలూ చూస్తోంటే వీడి కారణంగా తన సంసారం ఎక్కడ చిట్లిపోతుందో అని ఒక పక్కన చచ్చే భయంగానూ వుంటోంది.

అదేనో మరింకేదయినా కారణం వుందో ఖచ్చితంగా తేల్చిచెప్పలేంగానీ ఈ మధ్యన మాత్రం కామేశ్వరికి అతడిమీద శ్రద్ధాసక్తులు మరీ పెరిగిపోతున్నాయి. తెల్లవారుజామున నిద్ర లేపడం దగ్గర్నుంచి రాత్రి అతడు పడుకున్నాక పుస్తకాలు సర్దిపెట్టడం [illegible]- అన్ని పనులూ ఎంతో శ్రద్ధగా చేసి పెడుతోంది. అతను చదువుకుంటున్నంతసేపూ ఏ వారపత్రికో పుచ్చుకుని తానుకూడా అక్కడే కూచుంటోంది. మధ్యమధ్యలో మెల్లిగా కబుర్లుకూడా చెబు తోంది. జోకులు చదివి వినిపిస్తోంది. అర్ధరాత్రి అయినాసరే విసుక్కోకుండా టీ కలిపి ఇస్తోంది. చిరుతిళ్ళు కొసరి కొసరి తినిపిస్తోంది.

ఉదయాన్నే అతడికి బ్రెష్షు అందించడం, బట్టలు ఉతకడం, ఇస్త్రీ చెయ్యించడం, మేచింగులు చెప్పడం- ఇలా అన్నింటిలోనూ ప్రత్యేకమయిన శ్రద్ధని చూపిస్తోంది.

మధ్యాహ్నం భోజనాల దగ్గర అతని కబుర్లన్నీ, సాయంత్రం ఇంటికి రాగానే చిదంబరానికి చెప్పి విరగబడి నవ్వుతోంది, నవ్విస్తోంది.

కామేశ్వరిలో వచ్చిన ఈ మార్పుకి మొదట్లో


సంతోషించాడుగానీ, రాను రాను చిదంబరానికి వీళ్ళ వ్యవహారమేమీ నచ్చటల్లేదు.

పైగా- చదువు సాగలేదుగానీ లేకపోతే తాను కూడా ఈపాటికి ఫస్ట్ ఇయర్‌లో వుండాల్సిన దానిననీ, ఇతనూ నేనూ క్లాసుమేట్సు అవ్వాల్సిన వాళ్ళమనీ, పెళ్ళిపేరు చెప్పి ఆ ఛాన్సుని మీరే పోగొట్టేశారనీ కామేశ్వరి చిదంబరాన్ని విసుక్కుం టోంది కూడాను.

వాడిమీద శ్రద్ధ పెరిగిపోవడమేకాక తనని ఇలా నిర్లక్ష్యం చెయ్యడం ఎత్తిపొడవడం మరీ బాధగా వుంది చిదంబరానికి. తన పనులు తానే చేసుకోవలసి వస్తోంది. ఒకవేళ నోరు తెరిచి ఏదయినా అడిగితే గయ్‌మని పడిపోతోంది.

తువ్వాలా! ఆ మాత్రం వెదుక్కోలేరూ! ఆ స్టాండుమీదే వుంటుంది చూసి తీసుకోండి. జాగర్త- అతని బనీన్లూ అవీ మడతపెట్టి దాని మీదేవేశాను-వాటిని పడగొట్టేశారు గనకా!- ఇదీ వరస. అన్నింటికీ అతను అతను అతను.

తన ఇంటిలో తాను అప్రధానుడయి పోయాడు. ద్వితీయశ్రేణి సిటిజనుడయి పోయాడు. వీళ్ళు ఇద్దరూ కలిసి తనకేదో




అన్యాయం చేసేస్తున్నారు. భారీఎత్తున కుట్ర జరిగిపోతోంది. మనసు కుతకుతలాడిపోగా ఉక్రోషం పట్టలేక ఎప్పుడయినా ఎత్తిపొడిస్తే, కాస్త వ్యంగ్యంగా గుచ్చుకునేట్టు మాట్లాడితే—

ఏం? చేస్తే తప్పేమిటి? మీ మేనల్లుడేగా, పరాయివాడు కాదుగదా! అతనికి చెయ్యడంలో తప్పు ఏం వుంది? ఎవరుమాత్రం ఏమనుకుంటారు. ఎవరు ఏమనుకుంటేమాత్రం నాకేం? మీరేమీ అనుకోకుండా వుంటే చాలు, అదే పదివేలు. కాలేజీలో చదువుకుంటున్న కుర్రాడు, శ్రద్ధగా చూడకపోతే ఆనక మీకు మాట దక్కద్దూ!- అంటూ పెద్ద ఆరిందాలాగా ఎదురు తిరుగుతోంది కామేశ్వరి.

ఫస్ట్ ఇయర్ పరీక్షలు అయిపోయాయి. వేసవి సెలవలకి ఇంటికి పోతానన్న మేనల్లుణ్ణి- ఆ పల్లెటూరికి పోయి ఏం చేస్తావయ్యా! ఇక్కడే వుండి టైపూ షార్టు హేండూ నేర్చుకో. సెకండియర్ పుస్తకాలు సంపాయించి చదవడం మొదలుపెట్టు. - అంటూ కామేశ్వరి స్వయంగా ఆపేసింది.

చిదంబరానికి పిచ్చెత్తిపోయింది. జుట్టు పీకేసుకుని గట్టిగా అరిచేశాడు. పెట్టేబేడా సర్దుకుని తక్షణమే వాడిని బయటికి పొమ్మన్నాడు. ఇది ఆర్డరు దీనికి తిరుగులేదన్నాడు. మీదటేటికి మీ వాడిని నా దగ్గర పెట్టుకుని చదివించడం సాధ్యపడదనీ, తగినంత ముందుగా తెలియజేస్తున్నాను కాబట్టి హాస్టల్లోనే పడేస్తారో వేరే కాపరమే పెడతారో మీ తంటాలు మీరు పడండనీ, తన అక్కాబావలకి కరాఖండీగా ఉత్తరం రాసిచ్చి మరీ పంపించేశాడు.

వాడిని బస్సు ఎక్కించి సాగనంపి వస్తానంటూ కూడావెళ్ళిన కామేశ్వరి వస్తూ వస్తూ బుట్టెడు మల్లెపువ్వులు కొనుక్కు తెచ్చుకుంది.

దోమల వల్ల మీ నిద్ర పాడవుతోందా?




ఓడోమాస్ రాయండి,
హాయిగా నిద్ర పోండి.

BALSARA ఓడోమాస్
దోమల పాలిట శత్రువు

CHAITRA-B BLS 546 TEL